క్లుప్తంగా

సీసీరోడ్డుకు భూమిపూజ



సీసీరోడ్డు నిర్మాణానికి పూజ చేస్తున్న సర్పంచ్ మాధవి

ఆసిఫాబాద్‌రూరల్: ప్రజల సౌకర్యం కోసం సీసీరోడ్డు ఏర్పాటు చేస్తున్నామని బూర్గుడ సర్పంచ్ మాధవి అన్నారు. ఆదివారం మండలంలోని బూర్గుడలో లేకురివాడలో సీసీరోడ్డుకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రమేశ్, ఉప సర్పంచ్ కుమార్, నాయకులు గోపాల్, తదితరులు ఉన్నారు.

‘మన్‌కీ బాత్’ వీక్షించిన నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఆదివారం దేశ ప్రధాని నరేంద్రమోదీ మన్‌కీబాత్ 102వ కార్యక్రమాన్ని కార్యకర్తలతో కలిసి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ వీక్షించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దోని శ్రీశైలం, తాలూకా కన్వీనర్ వీరభద్రచారి, సీనియర్ నాయకులు ఠాగూర్ విజయ్ సింగ్, సుధాకర్, జిలకర పోచం, మొండయ్య, నానాజీ, రాజేందర్, దెబ్బటి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో విత్తనాలు

కౌటాల: మండల కేంద్రంలోని గురుడుపేట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సోయాబీన్, వరి, మినుములు, పెసలు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని సీఈవో బి.రాజేశ్ ఆదివారం తెలిపారు. సోయాబీన్ 30 కిలోల బ్యాగుకు ధర రూ.2370, వరి 25 కిలోల బస్తాకు ధర రూ.900, మినుములు 4 కిలోలకు రూ.440, పెసల్లు 4కిలోల బస్తాకు రూ.440 ధర ఉన్నట్లు ఆయన తెలిపారు. రైతులు ఆధార్‌కార్డు, పట్టా పాసు పుస్తకాం జిరాక్స్ కాపీలు వెంట తీసుకు రావాలని సూచించారు. మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు స్థానిక కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఎక్స్‌సర్వీస్‌మెన్ అసోసియేషన్ ఎన్నిక

కాగజ్‌నగర్‌రూరల్: జిల్లా ఎక్స్‌సర్వీస్‌మెన్ అసోసియేషన్ సమావేశాన్ని మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న దేవాలయ ఆవరణలో నిర్వహించారు. ఈసందర్భంగా కె.శివకుమార్‌ను అసోసియేషన్ అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. వైస్‌ప్రెసిడెంట్‌గా పియ్యూస్ మండల్, జనరల్ సెక్రటరీగా సునీల్ మండల్, ట్రెజరర్‌గా శివప్రసాద్, ఆర్గనైజర్ సెక్రటరీగా వినాయక చాప్లె, అడ్వయిజర్‌గా ముకేశ్ సింగ్, అనురోద్‌సింగ్, నీరజ్‌కుమార్, విజయ్‌కుమార్, బిద్యుత్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


గిరిజనుల సమగ్ర వికాసానికి ప్రభుత్వం కృషి



కారు అందజేస్తున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

కాగజ్‌నగర్‌రూరల్: గిరిజనుల సమగ్ర వికాసానికి కేసీఆర్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. ఆదివారం తన నివాసంలో చింతలమానెపల్లి మండలంలోని లంబటిహేటి గ్రామానికి చెందిన గోవింద్‌కు ఎస్టీ కార్పొరేషన్ కింద మంజూరైన ట్రైయినింగ్ కారును అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి సీఎం కేసీఆర్ ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఫలాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పేకాట స్థావరాలపై దాడులు



పట్టుకున్న పేకాట రాయుళ్లతో పోలీసులు

చింతలమానెపల్లి: మండలంలోని డబ్బా గ్రామం శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురిని గురువారం పట్టుకున్నట్లు ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం ముందస్తు సమాచారంతో డబ్బా గ్రామపంచాయితీలోని ధరంపెల్లి వద్ద పేకాట స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. పట్టుబడ్డ ఆరుగురి వద్ద నుంచి రూ. 8100 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

గ్రామకమిటీ ఎన్నిక

నార్నూర్: తాడిహత్నూర్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోపి, కార్యదర్శిగా రాజేశ్ జాదవ్, చంద్రశేఖర్, గౌరవ సలహాదారులుగా బాబూలాల్, రాజేశ్వర్, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ జిల్లెపల్లి నవీన్ కుమార్ తెలిపారు.

అసంపూర్తిగా ‘మన బడి’

- వసతులు లేక విద్యార్థుల ఇబ్బందులు
- నత్తనడకన సాగుతున్న పనులు



డబ్బా గ్రామంలో నిర్మాణంలో ఉన్న భోజనశాల

చింతలమానెపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో మన ఊరు మన బడిలో భాగంగా చేపట్టిన పనులు పూర్తికాకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. జూన్‌లో పాఠశాలలు ప్రారంభమయ్యేలోగా మండలంలో మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా ఎంపికైన పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో తీర్మానం చేశారు. ఈమేరకు ఏఈ బద్రుద్దీన్ పనులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. కాని ఇంతవరకు పనులు పూర్తి కాలేదు.

ఇదీ పరిస్థితి..

మండలంలో 39 ప్రాథమిక పాఠశాలలు, 6 ప్రాథమికోన్నత పాఠశాలలు, 9 ఉన్నత పాఠశాలలు మొత్తం 54 పాఠశాలలు ఉన్నాయి. గత ఏడాది రికార్డుల ప్రకారం పాఠశాలలో 3140 మంది విద్యార్థులు చదువుతున్నారు. మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం మండలంలోని 15 పాఠశాలలకు నిధులు మంజూరు చేసింది.

సమస్యల్లో పాఠశాలలు..

మండలంలోని ఆయా పాఠశాలల్లో వసతులు లేకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధానంగా మండలంలోని పాఠశాలల్లో తరగతి గదుల కొరత, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, శిథిలభవనాలు, ఇలా గతంలో పలు సమస్యలు పాఠశాలల్లో రాజ్యమేలుతుండేవి. కాగా మన ఊరు మన బడి కార్యక్రమంలో మండలంలోని పాఠశాలలను ఎంపిక చేయడంతో స్థానికంగా విద్యార్థులకు ఇబ్బందులు తొలగిపోతాయని స్థానికులు భావించారు.

నత్తనడకన పనులు..

మండలంలోని ఆయా పాఠశాలల్లో నిర్వహిస్తున్న మరమ్మతుల పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు మండలంలోని పాల్వాయినగర్, బాబాసాగర్ గ్రామపంచాయతీ బారెగూడ పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తి కాగా మిగతా పాఠశాలల్లో మాత్రం పనులు పూర్తి కాలేదు. కాగా పాల్వాయినగర్ పాఠశాలలో పనులు పూర్తికావడంతో అధికారికంగా పాఠశాలను ప్రారంభించారు. మండలంలోని బాబాసాగర్ బారెగూడ ప్రాథమిక పాఠశాలలో పనులు పూర్తయినా నీటి సరఫరా కల్పించక పోవడంతో మరుగుదొడ్లకు తాళాలు వేసి ఉంచారు.

విద్యాసంవత్సరం ప్రారంభమైనా..

గత ఏడాది ప్రారంభమైన పనులు ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే వరకు కూడా పూర్తికాకపోవడంతో అధికారుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా, అధికారులు, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేక పనులు జరగడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పాఠశాలల్లో పనుల నిర్వహణలో జాప్యం జరుగుతోందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మండలంలోని పాల్వాయినగర్, బారెగూడ పాఠశాలల్లో పనులు పూర్తికాగా గూడెం జిల్లా పరిషత్ పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాల, చింతలమానెపల్లి ఉన్నత పాఠశాలల్లో పనులు పూర్తయ్యే దశలో ఉన్నాయి. ఖర్జెల్లి పాఠశాల పనులు పూర్తికాగా త్వరలో ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ పాఠశాలలు మినహా మండలంలో మిగతా పాఠశాలల్లోని పనులన్నీ నత్తనడకనే జరుగుతున్నాయి.

త్వరలోనే పూర్తి చేస్తాం

మండలంలో మన ఊరు మన బడి కింద ఎంపిక చేసిన పాఠశాలల్లో పనులు త్వరలోనే పూర్తి చేస్తాం. ప్రహరీ పనులు ఉపాధిహామీ పథకం కింద నిర్వహిస్తుండడంతో పనుల్లో జాప్యం జరుగుతోంది. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్లను ఆదేశించాం.

– బద్రుద్దీన్, ఏఈ

ఘనంగా మంచినీళ్ల పండుగ



బెజ్జూర్: ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అభిలాష్



కెరమెరిలో ర్యాలీ తీస్తున్న నాయకులు

కెరమెరి: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో మంచినీళ్ల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామ పంచాయతీల్లో ర్యాలీలు నిర్వహించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం వివిధ గ్రామాలకు అందిస్తున్న మంచినీళ్లు, మిషన్ భగీరథ, ఫిల్టర్‌బెడ్స్, వాటర్ ట్రీట్మెంట్, నీళ్లను శుభ్రపరుస్తున్న తీరును ప్రజలకు వివరించారు. గ్రామాలకు అందుతున్న నీటి సౌకర్యం గురించి వివరించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ పెందోర్ మోతిరాం, జెడ్పీటీసీ సెడ్మకి దుర్పతబాయి, ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో సుదర్శన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశ్వేశ్వరరావు, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, ఐకేపీ ఏపీఎం జగదీశ్వర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బెజ్జూర్‌లో..

బెజ్జూర్: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మంచినీళ్ల పండుగను ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ విభాగం ఏఈ ఆకుల అభిలాష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల అభివృద్ధి కార్యాలయంలో సభ ఏర్పాటు చేసి ప్రజలకు మంచినీటి గురించి వివరించారు. బెజ్జూర్ గ్రామపంచాయతీలో మంచినీటిని సరఫరా చేస్తున్న సిబ్బంది కుమ్మరి పురుషోత్తంను సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పంద్రం పుష్పలత బిక్షమయ్య, బెజ్జూర్ ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా జావిద్ అలీ, ఎంపీడీవో మాధవి, ఎంపీవో రమేశ్ రెడ్డి, బెజ్జూర్ సర్పంచ్ కొట్రంగి శారద, ఉప సర్పంచ్ అద్దూరి రాజేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ మండలంలో..

ఆసిఫాబాద్‌రూరల్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లోని గ్రామాల్లో మిషన్ భగీరథ మంచినీటి ట్యాంకుల వద్ద ఉత్సవాలను స్థానిక సర్పంచ్‌లు, ఉప సర్పంచ్, కార్యదర్శులు పాల్గొని భగీరథ మంచినీటి వాడకంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

నిధుల పంచాయితీ..!

- నిధుల పక్కదారిపై కన్నెపల్లి సర్పంచ్ ఫిర్యాదు
- పంచాయతీ కార్యదర్శి స్వాహా చేశారని ఆరోపణ
- విచారణకు జిల్లా అధికారుల ఆదేశం

కౌటాల: గ్రామ పంచాయతీల్లో నిధులు దుర్వినియోగం కాకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం గతంలో డిజిటల్ ‘కీ’ విధానం తీసుకొచ్చింది. అయినా పలు గ్రామ పంచాయతీల్లో నిధుల దుర్వినియోగ ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలనే ఆలోచనలో కొందరు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. పంచాయతీల సర్వతోముఖావృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేస్తున్న నిధులు పక్కదారి పడుతున్నాయి. పలువురు సర్పంచులకు పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడంతో పాటు ప్రభుత్వాధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా లక్షల రూపాయల నిధులు స్వాహా అవుతున్నాయనే ఆరోపణలున్నాయి.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

మండలంలోని కన్నెపల్లి గ్రామ పంచాయతీలో నిధులు పక్కదారి పట్టించారన్న పంచాయతీ తారాస్థాయికి చేరింది. కన్నెపల్లి పంచాయతీ కార్యదర్శి జ్యోత్స్న సర్పంచ్, ఉప సర్పంచ్‌తో పాటు పాలకవర్గానికి ఎటువంటి సమాచారం అందించకుండా నిధులు పక్కదారి పట్టించారని గ్రామ సర్పంచ్ మోర్లె రమేశ్ జిల్లా ఉన్నతాధికారులకు ఇటీవల ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. కేంద్ర ప్రభుత్వం ద్వారా ఇటీవల పంచాయతీకి రూ.1.70 లక్షలు మంజూరయ్యాయి. డిజిటల్ ‘కీ’ ద్వారా మండల పరిషత్ కార్యాలయంలో నిధుల లావాదేవీలను పరిశీలించిన సర్పంచ్ రమేశ్ పూర్తి వివరాలు తెలుసుకొని ఇప్పటివరకు గ్రామ పంచాయతీలో రూ. 3లక్షల వరకు నిధులు పక్కదారి పట్టినట్లు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు పూర్తి విచారణ చేసి నిధులు రికవరీ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. డిజిటల్ కీ పంచాయతీ కార్యదర్శి వద్ద ఉండడంతో నిధులను పక్కదారి పట్టించినట్లు సర్పంచ్ ఆరోపించారు. ఈ విషయంపై ఎంపీడీవో నస్రుల్లా ఖాన్‌ను సంప్రదించగా కన్నెపల్లి గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగం జరిగినట్లు సర్పంచ్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించినట్లు తెలిపారు. త్వరలోనే సమగ్ర విచారణ జరిపి నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని ఎంపీడీవో పేర్కొన్నారు.

పశువులు రవాణా చేస్తున్న లారీ పట్టివేత

కాగజ్‌నగర్‌రూరల్: పశువులను అక్రమంగా రవాణా చేస్తున్న లారీని భజరంగ్ దళ్ కార్యకర్తలు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఓ లారీలో పశువులను తరలిస్తుండగా, భజరంగ్ దళ్ కార్యకర్తలు పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. ఈమేరకు పశువులను గోశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కాగజ్‌నగర్ పట్టణ పోలీసులు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

బోథ్: మండలంలోని సూర్యనగర్ గ్రామంలో పోచమ్మ ఆలయ నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వ జూనియర్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ ఆదివారం రూ. 10 వేల విరాళం అందజేశారు. ప్రతీ గ్రామంలో బడితో పాటు గుడి ఉంటేనే ఆధ్యాత్మిక భావన పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అశోక్‌రెడ్డి, చాబంతుల కృష్ణ, తూము సూర్యం, రవికాంత్, గోవర్ధన్, మానాల శేఖర్, రాకేష్ రెడ్డి, సాయి, ప్రశాంత్, సచిన్, మనోజ్, రోహిత్, అరవింద్, పవన్, నారాయణ పాల్గొన్నారు.

వర్షం కోసం పూజలు



కాగజ్‌నగర్‌రూరల్: వర్షం కురిసి పంటలు బాగా పండాలని మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న దేవాలయంలో ఆదివారం మహిళలు పూజలు చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో వర్షాల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. వర్షాలు పడాలని ఈజ్‌గాం దేవాలయంలోని శివమల్లన్న, కాలభైరవ, వీరభద్ర, మహంకాళి, శీతలమాత, ఆంజనేయస్వామి, నాగదేవతలకు పూజలు చేశారు. చల్లటి నీటితో అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఇందారపు రాజేశ్వర్‌రావుతో పాటు పలు గ్రామాల మహిళలు పాల్గొన్నారు.

రైతు సంఘం కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నాయకులను సన్మానిస్తున్న సభ్యులు

కెరమెరి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు కేంద్రె బాలాజి ఆధ్వర్యంలో మండల రైతు సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షుడిగా ఆడా రాంచందర్ (మెట్టిగూడ), ఉపాధ్యక్షుడుగా సయ్యద్ ఆజమ్(కెలిబి), కార్యదర్శిగా సెడ్మకి బార్‌షావ్ (సాకడబి,) సహాయ కార్యదర్శిగా కంబాల వినేష్ (కెరమెరి), కోశాధికారిగా కుర్సెంగ మారుతి (హట్టి)లను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. కాగా విద్యుత్, రెవెన్యూ, జల, పశుపోషణ, విత్తన పోషణ, జీవితబీమా, ఉపాధి కల్పన, న్యాయ, యువ ప్రముఖ్‌లను కూడా ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికైన నాయకులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రూప్‌లాల్ దస్తగిరి, గోవింద్‌రావు, సిరాజ్, అలీం, భీంరావు, జలపతి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

‘పేదలకు కార్పొరేట్‌స్థాయి వైద్యం’



చెక్కు పంపిణీ చేస్తున్న నాయకులు

బెజ్జూర్: పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు సీఎం కేసీఆర్ సీఎంఆర్‌ఎఫ్ పథకాన్ని అమలు చేస్తున్నారని మండల కో ఆప్షన్ సభ్యులు బషారత్‌ఖాన్ అన్నారు. మండలంలోని లంబాడిగూడ గ్రామానికి చెందిన ముడిమడుగుల అనిల్‌కు మంజూరైన చెక్కును బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి ఆదివారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ అనిల్ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరాడని, వైద్యఖర్చుల కోసం సీఎం రిలీఫ్‌ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సహకారంతో చెక్కు మంజూరైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గురుజల వెంకన్న, బీఆర్ఎస్ నాయకులు బొర్కుట్ తులసీరామ్, గోమాస నారాయణ, అజీమ్ ఖాన్, ముడిమడుగుల నారాయణ, దుపం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బియ్యం పాడైనా.. తరలించరా..?



ఎంఆర్‌సీ కార్యాలయంలో పాడైపోయి కంపు కొడుతున్న బియ్యం

కౌటాల: మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలోని మీటింగ్ హాల్‌లో మూడేళ్ల క్రితం 20 క్వింటాళ్ల మధ్యాహ్న భోజన బియ్యాన్ని అధికారులు నిల్వ ఉంచారు. లాక్‌డౌన్ కారణంగా పాఠశాలను మూసి వేయడంతో పాఠశాలలకు బియ్యం సరఫరా చేయలేదు. పాఠశాలల పునఃప్రారంభం అనంతరం నిల్వ ఉంచిన బియ్యం పూర్తిగా పాడైపోగా అక్కడే ఏళ్లుగా నిల్వ ఉంటున్నాయి. దీంతో బియ్యం చెడిపోయి పురుగులు పట్టి మీటింగ్ హాల్ అధ్వానంగా తయారైంది. వానాకాలంలో పురుగులు కార్యాలయంలోని అన్ని గదుల్లో ప్రవేశిస్తుండడంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయం సమీపంలోకి వెళ్తే దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పురుగులు పట్టిన బియ్యం అక్కడి నుంచి తరలించాలని ఉపాధ్యాయులు, సిబ్బంది కోరుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

తాంసి: ప్రజా సమస్యల పరిష్కారమే సీపీఐ లక్ష్యమని జిల్లా కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి అన్నారు. భీంపూర్ మండలంలోని ధనోరా గ్రామంలో ఆదివారం మహాసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చనందుకు మండలాల వారీగా ధర్నాలు చేస్తామన్నారు. గుంజాల గ్రామంలో గతంలో ఇచ్చిన భూములకు పట్టాలు లేక పథకాలు అందడం లేదన్నారు. వెంటనే వారికి పట్టాలిచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జందాపూర్ నుంచి కరంజి(టి) వరకు రోడ్డు బాగాలేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. భీంపూర్ మండల కార్యదర్శి పెద్ది సత్యనారాయణ, సీనియర్ నాయకులు బుర్రి సట్వాజీ, మేకల రవి, స్వామి, దత్తు, భూమయ్య, రాంబాయి, సుమలత, సుజాత పాల్గొన్నారు.

పచ్చడి ప్రియం..!

- పచ్చళ్ల తయారీపై ధరల పోటు
- కన్నీళ్లు తెప్పిస్తున్న కారంపొడి
- రెట్టింపైన ధనియాలు, ఆవాల రేట్లు
- మామిడికాయలదీ అదే దారి



పచ్చడిని మార్కెట్లో కొనుగోలు చేస్తున్న ప్రజలు

కెరమెరి: వేడివేడి అన్నం.. అందులో మామిడి కాయ పచ్చడి.. కలిపి తింటే ఆ రుచే వేరు. కాని పచ్చళ్ల తయారీకి వినియోగించే సరుకుల ధరలు వింటే నోరూరడం కాదు కదా.. నోటి నుంచి మాట రాని పరిస్థితి నెలకొంది. ప్రతీ ఇంట్లో నిత్యం వినియోగించే పచ్చళ్లు ఈ సారి ఖరీదయ్యాయి. తొక్కుల తయారీలో ఉపయోగించే అన్ని వస్తువుల ధరలకు రెక్కలొచ్చాయి. కారంపొడి, జీలకర, మెంతులు, ఆవాలు, ధనియాలకు తోడు మామిడి కాయల ధరలు చుక్కలంటుతున్నాయి. నోరూరించే ఆవకాయ ప్రస్తుతం సామాన్యులకు ఆర్థికంగా భారమైంది.


తగ్గిన మామిడి కాయల దిగుబడి

రైతులు ఏడాదికి సరిపడేంత పచ్చళ్లను తయారు చేసుకుంటారు. ఈసారి పచ్చళ్ల తయారీకి వాడే సరుకుల ధరలు అనూహ్యంగా పెరగడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఓ వైపు వర్షాభావం, మరోవైపు అకాల వర్షాలు, మామిడి కాయల దిగుబడి తగ్గడానికి కారణమయ్యాయి. దీంతో మార్కెట్లో మామిడి కాయల ధరలు నింగిని తాకుతున్నాయి. ఒక్క కాయ ధర రూ.10 నుంచి రూ.12వరకు పలుకుతుంది. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, కెరమెరి, జైనూర్, వాంకిడి, తిర్యాణి తదితర మండల కేంద్రాల్లో కొనసాగే వార సంతల్లోనూ ధరలు మండిపోతున్నాయి.

ధరలకు రెక్కలు..

తొక్కుల తయారీలో జీలకర, ఆవాల పొడి, మెంతులు, ధనియాల పొడి, కారంపొడి, ఉప్పు, పల్లినూనె వినియోగిస్తుంటారు. జీలకర ధర కిలో రూ.550, మెంతులు రూ.100, ధనియాలపొడి రూ.110, కారం పొడి రూ.300, నూనె లీటరు రూ.130లకు చేరింది. గతం ధరలతో పోలిస్తే జీలకరకు రూ.200 పెరగ్గా, ఇతర సరుకుల ధరలు రూ.20 నుంచి రూ.50 వరకు పెరిగాయి. కుటుంబానికి సరిపడే పచ్చడి తయారీకి గతంలో రూ.2వేల లోపు ఖర్చయ్యేది. కాని ప్రస్తుతం పెరిగిన ధరలతో రూ.3 వేల నుంచి రూ.3500 వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు. బయటి మార్కెట్‌లో నేరుగా పచ్చడి కొనుగోలు చేస్తే కేజీకి రూ. 150 వరకు పడుతుంది. ఇంట్లో తయారు చేసుకోవడం కంటే బయట మార్కెట్‌లో కొనుగోలు చేయడం చౌకగా ప్రజలు భావిస్తున్నారు.

పచ్చడి తయారీ కష్టంగా మారింది



పచ్చడి తినే అలవాటు ఉంది. కానీ పెరిగిన ధరలతో ఇంట్లో పచ్చడి తయారు చేయడం కష్టంగా మారింది. దీంతో మార్కెట్లో లభించే పచ్చడినే కొనుగోలు చేయడం అనివార్యమైంది. పచ్చడి తయారీకి ఉపయోగించే జీలకర ధరతో పాటు ఆవాలు, మిరియాలు, ఇతర సరకుల ధరలు బాగా పెరిగాయి.

– పాతాడే మేఘా, గృహిణి, కెరమెరి